క్లుప్తంగా

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పరిశీలన

కూసుమంచి: కూసుమంచిలోని ఎమ్మెల్యే అధికారిక క్యాంపు కార్యాలయాన్ని బుధవారం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పరిశీలించారు. కార్యాలయంలో చేపట్టాల్సిన పలు పనులపై ఆయన పలు సూచనలు చేశారు. నూతన సంవత్సరానికి క్యాంపు కార్యాలయ ప్రవేశం చేయనున్నట్లు దయాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

నేలకొండపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రూపొందించిన వికసిత్ భారత్ ప్రచార రథం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి, బీజేపీ నాయకులు హనుమంతరావు, పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, అధికారులు, గ్రామ దీపికలు, స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


ఎం.నందిని

రఘునాథపాలెం: రాష్ట్ర స్థాయి అండర్–17 బాలికల క్రికెట్ పోటీలకు రఘునాథపాలెం కేజీబీవీ ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎం.నందిని ఎంపికైంది. అశ్వారావుపేటలో ఈనెల 23 నుంచి 26 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె ఉమ్మడి జిల్లా జట్టు తరఫున పాల్గొననుంది. ఈ సందర్భంగా నందినిని జీసీడీఓ భూలక్ష్మి, ఉమెన్స్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.డీ.మతిన్, కోచ్ శివ, ఎస్‌టీఎఫ్ కార్యదర్శి నర్సింహమూర్తి, స్పెషల్ ఆఫీసర్ వై.లత అభినందించారు.

బీజేపీ ఆధ్వర్యాన నిరసన

నేలకొండపల్లి: భారత రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కడ్‌ను ప్రతిపక్షాలు అవహేళన చేయడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగ పదవులలో ఉన్న వారిని అవమానిస్తే ప్రజలు క్షమించరని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాగర్తి సుధాకర్, షర్ఫీద్దీన్, హనుమంతరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, కె.వెంకటేశ్వర్లు, ఉదయ్, సూరిబాబు, నాగచారి, మన్నె రాధాకృష్ణ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో వరి సాగు లాభదాయకం


డ్రమ్ సీడర్ లాగి అవగాహన కల్పిస్తున్న ఏఓ

కూసుమంచి: డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి నాటడం లాభదాయకమని ఏఓ వాణి అన్నారు. గురువారం మండలంలోని జక్కేపల్లి గ్రామంలో కొత్తా వెంకటరెడ్డి అనూ రైతు క్షేత్రంలో డ్రమ్ సీడర్ ద్వారా వరి నాటే విధానంపై అవగాహన కల్పించి లాభాలను వివరించారు. రైతులు నేరుగా విత్తనాలు వెదజల్లడం, డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా ఎకరాకు రూ.8వేల ఖర్చును తగ్గించవచ్చని, కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. పంట కూడా 15 రోజులుగా ముందు వస్తుండడంతో రైతులకు లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలి

కామేపల్లి: ఊట్కూర్ గ్రామంలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరాలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని కోరుతూ మిషన్ భగీరథ సీఈ శ్రీనివాసరావు, ఎస్‌సీ సదాశివుడుకు ఊట్కూర్ ఎంపీటీసీ ఏపూరి హేమమాలిని, సర్పంచ్ కోటెం సులోచన గురువారం ఖమ్మంలోని ఎస్‌సీ కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సుదూర ప్రాంతాలను కలుపుతూ పైపులైన్ వేయడం ద్వారా గ్రామంలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌కు భగీరథ ప్రధాన ట్యాంక్ కేవలం రెండు కిలోమీటర్ల సమీపంలోనే ఉన్నా మంచినీరు సరఫరా కావడం లేదన్నారు. గ్రామానికి ప్రత్యేక పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నిధులు విడుదల చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: బ్రాహ్మణ పరిషత్‌కు నిధులు వెంటనే విడుదల చేయాలని బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకుడు జమలాపురం రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మామిళ్లగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణాలు మంజూరైనా వారికి నేటి వరకూ నిధులు అందలేదని, ప్రభుత్వం వెంటనే రుణాలు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వల్లూరి సత్యనారాయణ, వీ.జీ.కే మూర్తి, చాగంటి రామకృష్ణ, కె.సరస్వతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదవి పోరు.. పైరవీల జోరు!

మార్కెట్ కమిటీపై కాంగ్రెస్ నాయకుల గురి..

- రోజు రోజుకు పెరుగుతున్న ఆశావహులు
- మూడు మండలాల నుంచి పోటా పోటీ
- రిజర్వేషన్ల అమలుపై నాయకుల ఉత్కంఠ
- ప్రభుత్వం మారిన రాజీనామా చేయని ప్రస్తుత పాలకవర్గం



నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మన్ పదవిపై నియోజకవర్గ నాయకులు దృష్టి సారించారు. మూడు మండలాల నుంచి వస్తున్న జాబితా రోజు రోజుకు చాంతాడంతా పెరుగుతోంది. కాగా, రిజర్వేషన్‌ను ప్రకటించే వరకూ అంతర్గతంగానే ముందుకు సాగాలని ఎవరికి వారే ఆశీస్సుల కోసం తిరుగుతున్నట్లు సమాచారం. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఉన్న ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి మండలాల నాయకులు ఈ కమిటీపై కన్ను ఉంది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసేందుకు కసరత్తు ప్రారంభించినట్లు తెలియడంతో నాయకులు చైర్మన్, డైరెక్టర్ పోస్టుల కోసం పరుగులు తీస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లను అమలు చేయడంతో పాటు పదేళ్ల వరకు పెంచింది. ఈనేపథ్యాన రాష్ట్రం కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం చైర్మన్ పదవికి జనరల్ మహిళకు కేటాయించగా.. గత ప్రభుత్వం లేనప్పటికీ ప్రస్తుతం చైర్మన్, పాలకవర్గం మాత్రం రాజీనామా చేయకపోవడం పెద్ద చర్చాంశనీయంగా మారింది.

జనరల్‌కు రిజర్వ్ అయితే గట్టి పోటీ..

నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి జనరల్‌కు రిజర్వ్ చేస్తే మూడు మండలాల నుంచి గట్టి పోటీ ఉందనే చెప్పొచ్చు. నేలకొండపల్లికి చెందిన మాజీ చైర్మన్ శాఖమూరి రమేశ్, నెల్లూరి భద్రయ్య, కోడాలి గోవిందరావు, వంగవీటి నాగేశ్వరరావు, కూసుమంచి మండలానికి చెందిన జొన్నలగడ్డ రవికుమార్, మరో ఇద్దరు నేతలు, ముదిగొండ మండలానికి చెందిన ముగ్గురు పోటీలో ఉన్నట్లు సమాచారం. అదే విధంగా బీసీ సామాజిక వర్గానికి ఇవ్వాల్సి వస్తే.. నేలకొండపల్లి మండలానికి చెందిన మాజీ చైర్మన్ వెనికె జానకిరామయ్య, వెన్నపూసల సీతారాములు, మైశా శంకర్, కూసుమంచి మండలానికి చెందిన మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావుతో పాటు పలువురు ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

చైర్మన్ కావాల్సిందే..

మార్కెట్ కమిటీ పాలకవర్గంలో ఇప్పటి వరకు చైర్మన్ పదవిని నేలకొండపల్లి, కూసుమంచి మండలాలకు చెందిన వారు తప్ప.. ముదిగొండ మండలానికి అవకాశం ఇవ్వలేదు. ముదిగొండ మధిర నియోజకవర్గంలో ఉండడంతో ప్రాధాన్యత తగ్గడంతో ప్రతీ పాలకవర్గంలో ఉపాధ్యక్షుడితో సరిపెట్టుకుంటున్నారు. కానీ ఈ దఫా చైర్మన్ పదవిని అడగాలనే ఆలోచనలో నాయకులు ఉన్నట్లు తెలిసింది. ఈసారి ఎలాగైనా పదవి దక్కించుకోవాలని పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తుంది.

తలనొప్పిగా మారిన కమిటీ కూర్పు..

వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం కమిటీ కూర్పు డివిజన్ నాయకులకు తలనొప్పిగా మారుతుందని పలువురు పేర్కొంటున్నారు. కాంగ్రెస్‌లో ఉన్న నాయకత్వం ఏ గ్రామంలో చూసినా వన్‌సైడే ఉండడంతో తమకు అనుకూలంగా ఉన్న వారికి ఇప్పించుకోవాలని ఎవరికి వారే పట్టుబడుతున్నారు. ఇదిలా ఉండగా.. ఎన్నికలలో పొత్తులో భాగంగా పని చేసిన టీడీపీ, సీపీఐ నాయకులు కూడా కనీసం డైరెక్టర్‌గా అవకాశం కల్పించాలని కోరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మొత్తం మీద నేలకొండపల్లి మార్కెట్ పాలకవర్గంపై కాంగ్రెస్ నాయకులు గురి రోజు రోజుకు పెరుగుతుంది.

మార్కెట్ సమస్యలు పరిష్కరించాలని ధర్నా


మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం మార్కెట్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యాన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ... మార్కెట్‌లో టాయిలెట్లు, భోజనశాలలు, ప్రాథమిక వైద్యం వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మార్కెట్‌కు వస్తున్న పంట ఉత్పత్తుల ద్వారా మార్కెట్‌కు కోట్లాది రూపాయల ఆదాయం వస్తుండగా.. కనీస సదుపాయాలు కల్పించకపోవడం దారుణం అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేతకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు యర్రా శ్రీనివాస్‌రావు, భూక్యా శ్రీనివాసరావు, మద్ది సత్యం, బండారు యాకయ్య, వేల్పుల నాగేశ్వరరావు, సోమనోయిన వెంకటేశ్వర్లు, పత్తిపాక నాగసులోచన, శీలం వీరబాబు, హమాలీ యూనియన్ నాయకులు హెచ్.వీరయ్య, వెంకటేశ్వరరావు, వీరస్వామి, కృష్ణ, మద్ది శ్రీను, దడవాయి సంఘం నాయకుడు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మంలోని అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్రమోదీ జెడ్ కమిటీ వేసి వర్గీకరణ చేస్తానని చెప్పి మాట తప్పారన్నారు. చట్టబద్ధత కల్పించని పక్షంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెబుతామన్నారు. రాష్ట్ర నాయకులు వెంకన్న, జిల్లా నాయకులు ఎల్‌వీఆర్, వి.వెంకటేశ్వర్లు, నరసింహ, భద్రయ్య, వేణు, శ్రీను, జి.వెంకటేశ్వర్లు, ఆదె భద్రయ్య పాల్గొన్నారు.

ఎన్పీడీసీఎల్ సీఎండీని కలిసిన సీఐటీయూ నేతలు

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని గురువారం తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ప్రతినిధుల బృందం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా పలు సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి ఎం.ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరాజు, స్వామి, కొలగాని రమేశ్, శ్రీనివాస్, పూర్ణ, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా సెమీ క్రిస్మస్


బైరవునిపల్లిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లిలో మల్లేబోయిన ఉపేందర్ నివాసంలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్‌ను కట్ చేసి వేడుకలు ప్రారంభించిన పాస్టర్ శాలేంరాజు అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు ప్రభువును కీర్తిస్తూ పాటలు పాడి వాక్యాన్ని బోధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మరికంటి ఉమారాణి, పాస్టర్లు వడ్లమూడి డేవిడ్ రాజు, సంఘం విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులాల పనివేళలు మార్చాలి

ఖమ్మం సహకారనగర్: మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల పనివేళలను ఇతర సంక్షేమ గురుకుల విద్యాలయాలతో సమానంగా మార్పు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ. నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు అనుకూలంగా పనివేళలు మార్చినప్పటికీ, బీసీ గురుకులాల్లో మార్చకుండా ఏకపక్ష వైఖరితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. టీఎస్ యూటీఎఫ్‌కు అనుబంధంగా బీసీ గురుకుల ఉపాధ్యాయుల విభాగం రాష్ట్ర కమిటీలో వివిధ హోదాలో చోటు సంపాదించిన జి.లివిన్‌స్టన్, వి.స్వర్ణలత, సురేష్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

కుక్కలగుట్ట భూములు సర్వే చేయిస్తాం..


రెవెన్యూ అధికారులకు భూముల వివరాలను తెలియజేస్తున్న రైతులు

రఘునాథపాలెం: మండల పరిధిలోని ఈర్లపూడి రెవెన్యూ పరిధిలోని కుక్కలగుట్ట భూములకు సంబంధించి అందరి రైతుల ఆమోదంతో సర్వే నిర్వహిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. గురువారం గుట్టభూమిని పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెవెన్యూలోని సర్వే నంబర్ 100లో సుమారు 180 ఎకరాల భూమిని కొంత మంది రైతులు హద్దులు, చెట్లపొదలను తొలగించి సాగు చేసుకుంటున్నట్లు ఇటీవల తహసీల్దార్ లూథర్ విల్సన్‌కు పుటానితండా వాసులు వినతి పత్రాన్ని అందజేశారు. తమ భూములన్నింటికి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని వినతిలో పేర్కొనగా.. భూముల పరిశీలనకు వచ్చామని, సర్వే నిర్వహించి హద్దులు తీస్తామని ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, సర్వార్, శ్రీనివాసరావు, వీఆర్ఏ ఉపేందర్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగేశ్వరరావు, గుగలోత్ రమేశ్, బానోత్ రమేశ్, భూక్య నరేశ్, బానోత్ వీరన్న, కుమార్, కిషన్, భూక్యా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: జీవితం జీవించడానికే గానీ ఆత్మహత్యలు చేసుకోవడానికి కాదని, కష్టాలు వచ్చినప్పుడు ధైర్యంగా ముందుకు సాగాలని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు. గురువారం ఖమ్మం బస్‌డిపో ప్రాంగణంలో ఆర్టీసీ కార్మికులకు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఆత్మహత్యలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.అలాగే డీఎం బాడిక శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ సంస్థ ద్వారా ఇప్పటి వరకు 28 మందిని కాపాడడం అభినందనీయమన్నారు. అనంతరం ఆత్మహత్యలు చేసుకోబోమని ప్రమాణం చేయించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గద్ద వెంకట్రామయ్య, ఖమ్మం ఈవైతై బ్యాంక్ ఇన్‌చార్జ్ హరిప్రసాద్, ఆర్టీసీ ఖమ్మం డిపో సీఐ రామయ్య, సూపరింటెండెంట్ జయరాజ్, అంజయ్య, ఆదినారాయణ, నరేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'త్రివేణి'లో మ్యాథ్స్ ఎగ్జిబిషన్

ఖమ్మం సహకారనగర్: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నగరంలోని త్రివేణి పాఠశాలలో మ్యాథ్స్ ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు త్రివేణి పాఠశాలల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి తెలిపారు. పాఠశాలలో జరుగుతున్న మ్యాథ్ ఫెస్ట్‌లో భాగంగా మ్యాథ్ ఎగ్జిబిషన్ నిర్వహించామని, విద్యార్థులు తయారు చేసినప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయన్నారు. ఈ కార్యక్రమాన్ని కృష్ణవేణి కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు రజనీకాంత్, ఠాగూర్‌లు సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడగా.. కృష్ణవేణి-త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు విశేష స్పందన

ఖమ్మంరూరల్: మండలంలోని సత్యనారాయణపురం–కొత్తూరు గ్రామ శివారులో గల దేర్ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు పెద్దఎత్తున అభ్యర్థులు హాజరయ్యారు. హిందుస్థాన్ కోకోకోలా బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్‌లో 25 మంది అర్హత సాధించగా.. వీరికి శనివారం ఇంటర్వ్యూలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ.. కాలేజీలో ప్లేస్‌మెంట్ ప్రక్రియ నిరంతరంగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, రవిచంద్ర, ప్రభాకర్, ప్రసన్న, పుల్లయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

నేలకొండపల్లి: విద్యార్థుల నడుమ చిన్నగా మొదలైన గొడవ ఘర్షణకు దారితీసింది. మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు గురువారం గిఫ్ట్ కొనుగోలు చేసేందుకు నేలకొండపల్లిలోని షాపునకు వచ్చారు. మరో పాఠశాల విద్యార్థులు అప్పుడే రావడంతో పరస్పరం విమర్శలు చేసుకున్నారు. ఇందులో ఓ పాఠశాల విద్యార్థి విషయమై అసభ్యంగా మాట్లాడటంతో తన తండ్రికి ఫోన్ చేయగా, ఆయన చేరుకుని గొడవకు దిగాడు. స్థానికులు పలువురు గుమికూడగా, పోలీసులు వస్తున్నారనే సమాచారంతో ఎక్కడివారక్కడ వెళ్లిపోయారు.

మంత్రి పొంగులేటికి రైతుల వినతి


మంత్రి శ్రీనివాసరెడ్డికి సమస్యను వివరిస్తున్న రైతులు, పరిరక్షణ కమిటీ సభ్యులు

ఖమ్మంరూరల్/రఘునాథపాలెం: మండలంలో తీర్థాల నుంచి రెమిడిచర్ల వరకు నిర్మించనున్న నాగపూర్–అమరావతి జాతీయ రహదారి అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ బుధవారం పలు గ్రామాలకు చెందిన వారు, రైతులు హైదరాబాద్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ రహదారి వెళ్లే గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టలేదని, ఈ రహదారి నిర్మాణం వలన అనేక ఇబ్బందులు ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ రహదారిని మంగళగూడెం నుంచి మంచుకొండ మీదుగా తనికెళ్ల, ప్రొద్దుటూరుకు మార్చాలని విన్నవించారు. ఈ విషయాన్ని పరిశీలించి తగు న్యాయం చేస్తానని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. అలాగే నేషనల్ హైవే రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని రఘునాథపాలెం మండలం పరిధిలోని బాధిత రైతులు గురువారం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులను తదితరులను కలిసి వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు తక్కళ్లపాటి భద్రయ్య, ప్రసాదు, బాబు,రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన (2000 – 2001 బ్యాచ్) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువారం గొల్లగూడెం రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లోపూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం నాటి గురువులు సత్యనారాయణ, కృష్ణసింగ్, ప్రసాదరావు, విజయభాస్కర్, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, మూర్తి, రాంబాబు తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎస్.రమేష్, కె. రవికుమార్, ఎస్.జగదీష్, సీహెచ్.చంద్రరావు, శ్రీను, తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ విప్లవ, ప్రజా రాజకీయ పార్టీల ఐక్యత మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా సీనియర్ నాయకుడు కూసు అప్పారావు అన్నారు. గురువారం మండలంలోని దమ్మాయిగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) రేవులేషనరీ ఇన్విటేషన్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా కలిసి ఒకే పార్టీలో విలీనం కాబోతున్నాయని ప్రచారం చేశారు. ఈ యూనిటీ మహాసభలను వచ్చే ఏడాది మార్చి 3,4,5 తేదీల్లో ఖమ్మం నగరంలో జరుపుకోనుండగా.. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పాలేరు డివిజన్ నాయకుడు తిమ్మిడి హనుమంతరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, పీవైఎల్ ఖమ్మం డివిజన్ నాయకుడు ఉన్నం నరేశ్, రాము, జగదీశ్, శాంతన్‌కుమార్ పాల్గొన్నారు.

వీ.వీ.పాలెంలో రోడ్డు ప్రమాదం

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంపై రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మం వైపు వస్తున్న కారును లారీ ఢీకొట్టగా, కారు ధ్వంసమైంది. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. కారు యజమాని కొండలరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి


అధ్యక్షులను సన్మానిస్తున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా మండలాల అధ్యక్షులకు లబ్ధిదారుల ఎంపికలో అనుబంధ సంఘాల అధ్యక్షులు సహకరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర పార్టీ కమిటీలకు ఖమ్మంపై ఉన్న మంచి అభిప్రాయంతో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చారన్నారు. అనంతరం అనుబంధ సంఘాల అధ్యక్షులను శాలువాలతో సన్మానించారు. రానున్న గ్రామ పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఇదే స్ఫూర్తితో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కొత్తా సీతారాములు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గౌస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, మొక్కా శేఖర్‌గౌడ్, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి


డీఐఈఓకు వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకురాళ్లు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈఓ) కె.రవిబాబులను గురువారం పలువురు మహిళా అధ్యాపకురాళ్లు వేర్వేరుగా కలిసి విన్నవించారు. అనంతరం అధ్యాపకురాలు విజయలక్ష్మి తదితరులు మాట్లాడుతూ.. ఆ అధ్యాపకుడి ప్రవర్తన వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని, అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సుమ మాలిని, మియాజ్ పర్వీన్, శారదా, షకీలా, భాను, స్వప్న, బిందుశ్రీ,, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్.జగన్ జన్మదిన వేడుకలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రులు, వృద్ధాశ్రమాలు, అనాథశరణాలయాల్లో పాలు, పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేయడం, అన్నదానానికి వితరణలు, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో జగన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంమయూరిసెంటర్: అగ్రహారంలో వైఎస్.జగన్ జన్మదిన వేడుకల్లో చిన్నారులు


ఖమ్మంమయూరిసెంటర్: 16వ డివిజన్ కొత్తూరులో వైఎస్.జగన్ జన్మదిన వేడుకలు


రఘునాథపాలెం: వీవీపాలెంలో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న యూత్ సభ్యులు


ఖమ్మంమయూరిసెంటర్: కేక్ కట్ చేస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు


ఖమ్మంమయూరిసెంటర్: దుర్గాభవానీ వృద్ధాశ్రమానికి ఆర్థిక సాయం చేస్తున్నఅభిమానులు


ఖమ్మం క్రైం: ఖమ్మం సుందరయ్యనగర్‌లో కేక్ కట్ చేసిన అభిమానులు